www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 21 అక్టోబర్ 2023

5

ఏలూరు

9 గంటలు నిరంతరాయంగా విద్యుత్ ఇవ్వాలి

ఉంగుటూరు : వ్యవసాయానికి నిరాటంకంగా తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షులు సింహాద్రి సత్యనారాయణ కోరారు. శుక్రవారం ఉంగుటూరు రైతు భరోసా కేంద్రం వద్ద జరిగిన మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. బోర్ల కింద వరి సాగు రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, నిరంతరం తొమ్మిది గంటలు విద్యుత్ ఇవ్వాలని కోరారు. ధాన్యం సేకరణకు ఆర్‌బికెలకు బారోలను ముందుగానే జిఐఎస్ ట్యాగింగులు పూర్తి చేయాలని కోరారు. రైతులకు రాయితీపై బరకాలను సరఫరా చేయాలన్నారు. ఉప్పుగెల్లికోవరం, నాచుగుంట, నీలాద్రిపురం, కాగుపాడు, ఉంగుటూరు-1,2, గోపీనాథపట్నం రైతు భరోసా కేంద్రాల పరిధిలో ధాన్యం సేకరణ బాధ్యతలను డిసిఎంఎస్ నుంచి నారాయణపురం సొసైటీకి అప్పగించాలని తీర్మానించారన్నారు. గోనె సంచులు నిల్వ ఉంచేందుకు క్షేత్ర సంచుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్పర్సన్ పాపారావుబాబ్జీ, మండలి సభ్యులు వెంకట్రావు, ఎ.వెంకటేష్, ఎఐ వాణి పాల్గొన్నారు.

రెండు నెలల్లో అభివృద్ధి పనులన్నీ పూర్తికావాలి

దిశ సమావేశంలో అధికారులకు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ ఆదేశం

ఎంపీ నిధులు పూర్తిగా వినియోగించాలి

సాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం చేయాలని, రెండు నెలల్లో పనులన్నీ పూర్తికావాలని ఏలూరు ఎంపీ, దిశ కమిటీ ఛైర్మన్ కోటగిరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జిల్లా అభివద్ధి సమన్వయ పర్యవేక్షణ (దిశ) కమిటీ సమావేశం శ్రీధర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలుపై జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణితో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ ఆరోగ్యం, వ్యవసాయం, విద్యా రంగాల ప్రగతిలో మనరాష్ట్రం దేశంలో ముందంజలో ఉందనడంలో సందేహమే లేదన్నారు. ఎంపీ నిధులతో మంజూరుచేసిన పనులన్నింటిని పూర్తిచేయడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. జిల్లాకు ఎంపీ ల్యాడ్స్ కింద వచ్చిన నిధులు పూర్తిగా అభివద్ధి పనులకు వినియోగించబడేలా చూడాలని అధికారులకు ఆయన స్పష్టమైన ఆదేశాలిచ్చారు. జిల్లాలో 1809 ప్రభుత్వ పాఠశాలల్లో గోరుముద్ద కార్యక్రమం కింద 1,34,925 మంది బాలబాలికలకు రూ.45.76 కోట్లతో పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. నాడు-నేడు కింద ఫేజ్-2లో చేపట్టిన 1453 పాఠశాలల అభివృద్ధి పనులు డిసెంబరు నెలాఖరుకు పూర్తిచేస్తామని తెలిపారు. కైకలూరు నియోజకవర్గంలో పలు పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీచేయాలని కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు సమావేశం దృష్టికి తీసుకువచ్చిన అంశంపై సంబంధిత అధికారులు ఈ విషయంపై అక్టోబరు నెలాఖరుకు చర్యలు తీసుకోవాలని ఎంపీ విద్యాశాఖాధికారులను ఆదేశించారు. కాలువ శివారు ప్రాంతాలకు సాగునీరు అందించడంపై ప్రత్యేక చొరవ చూపాలని ముఖ్యంగా దూలం నాగేశ్వరరావు లేవనెత్తిన అంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టి స్థానిక అవసరాలను పరిగణనలోకి తీసుకుని సాగునీరు అందించడంపై యుద్ధప్రాతిపధికగా చర్యలు తీసుకోవాలన్నారు. కరాటం కృష్ణమూర్తి కెనాల్ బండ్‌పై తుప్పలు తొలగించాలని ఇరిగేషన్ ఎస్ఇ శ్రీనివాసరావును ఆదేశించారు. రహదారుల అభివృద్ధి, మరమ్మతుల కోసం ఇప్పటికే పిలిచిన టెండర్లపై కాంట్రాక్టర్లతో అధికారులు మాట్లాడి పనులు చేపట్టేలాగా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు.

జెసి బి.లావణ్యవేణి మాట్లాడుతూ వ్యవసాయం, ఇరిగేషన్, విద్య, ఆరోగ్యం, తదితర ప్రాధాన్యతాంశాలపై సమీక్షించామన్నారు. నియోజకవర్గాల స్థాయిలో వచ్చేనెల 16వ తేదీన ఆసుపత్రి అభివృద్ధికి సొసైటీల సమావేశాలను నిర్వహించాలని ఈ సమావేశంలో అందుబాటులో ఉన్న నిధులతో చేపట్టాల్సిన ప్రాధాన్యత పనులను స్థానిక ప్రజాప్రతినిధులు సమావేశంలో తెలిపే అంశాలను ప్రాధాన్యత క్రమంలో నిధులను ఖర్చుచేసే చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు నిధులకు అవసరమైన పనుల జాబితాను రూపొందించాలన్నారు. కైకలూరు నియోజకపర్గంలో సాగునీటి సమస్యపై స్థానిక శాసన సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చిన అంశాలను పరిశీలించి కాలువ శివారు ప్రాంతాలకు సాగునీరు సవ్యంగా విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. కైకలూరు నియోజకవర్గంలో ఉపాధ్యాయుల ఖాళీలను ఈ నెలాఖరుకు భర్తీచేసేందుకు ఆయా రేషనలైజేషన్ పద్ధతిలో ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని, కృష్ణా, ఏలూరు, విద్యాశాఖ అధికారులను జెసి ఆదేశించారు. అవసరమైతే డిప్యూటేషన్లు రద్దుచేసైనా భర్తీలను పూరించాలన్నారు.

దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో శివారు ప్రాంతాలకు సాగునీరు అందించడంలో యుద్ధప్రాతిపధికపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత శాఖ ఎస్ఇ దృష్టికి తీసుకెళ్లామని ఈ విషయంలో స్పష్టమైన ఆదేశాలివ్వాలన్నారు. కైకలూరు నియోజకవర్గంలో పలు పాఠశాలల్లో ఖాళీగా ఉన్నఉపాధ్యాయ పోస్టులను భర్తీచేసి విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా చూడాలన్నారు. ఆసుపత్రుల అభివృద్ధి సొసైటీల ఆధ్వర్యంలో ఆసుపత్రుల అభివృద్ధికి చేపట్టే చర్యలపై సమగ్రంగా చర్చించేందుకు నియోజకవర్గస్థాయి సమావేశాలు నిర్వహించాలని కోరారు.

సంసద్ ఆదర్శగ్రామ యోజన(సాగి)పై సమీక్ష...

సంసద్ ఆదర్శ గ్రామ యోజన కింద కోటగిరి శ్రీధర్ దత్తత తీసుకున్న ఐదు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రగతిని ఈ సమావేశంలో సమీక్షించారు. ఈ విషయంలో రాష్ట్రంలో మొదటి 20 స్థానాల్లో ఏలూరు జిల్లా ఒకటిగా ఉందన్నారు. కామవరపుకోట, భీమడోలు, దెందులూరు, టి.నరసాపురంలో సంసద్ ఆదర్శ గ్రామ యోజన కింద దత్తత తీసుకున్న గ్రామాల్లో మిగిలిన చోట్ల నూరుశాతం పనులు పూర్తి కాగా టి.నరసాపురం మండలం బొర్రంపాలెంలో 54 పనుల్లో 47 పనులు పూర్తి చేశారని మిగిలిన ఏడు పనులు వెంటనే పూర్తిచేయాలన్నారు. ఏలూరు జిల్లాలో ఏడు, తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఐదు, రైల్వే లెవలింగ్ క్రాస్‌లు మూసి ఆర్ఓబి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సమావేశంలో కైకలూరు కృష్ణా, ఏలూరు, జిల్లాపరిషత్ సిఇఒలు, జోషిబోస్, రవికుమార్, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు

రైతులకు సాగునీరు అందించలేని ఎంఎల్‌ఎ పదవి ఎందుకు

సమావేశం నుంచి బయటకు వచ్చేసిన కైకలూరు ఎంఎల్‌ఎ దూలం

రైతులకు సక్రమంగా సాగునీరు కూడా అందించలేని ఎంఎల్‌ఎ పదవి ఎందుకు, నియోజవర్గంలో కూడా తిరగలేను, రాజీనామా చేస్తా' అంటూ కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు జిల్లా అభివృద్ధి పర్యవేక్షణ, సమన్వయ కమిటీ సమావేశంలో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తన నియోజకవర్గంలో రైతులు సాగునీటి కోసం నానాఅవస్థలు పడుతున్నారని, పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. ఇరిగేషన్ శాఖ తన నియోజకవర్గానికి తీవ్ర అన్యాయం చేస్తుందంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గానికి తగిన స్థాయిలో నీరు అందించకపోతే నేను నియోజకవర్గంలో తిరిగే పరిస్థితి లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో ఎంపీ కోటగిరి శ్రీధర్, జెసి లావణ్యవేణి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినా వినకుండా సమావేశం హాలు నుంచి ఆయన బయటకు వచ్చేశారు.



దీక్షలను విరమింపజేస్తున్న ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

యుటిఎఫ్ దీక్షలు విరమణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిపిఎస్, జిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఏలూరులోని యుటిఎఫ్ కార్యాలయంలో చేపట్టిన నిరవధిక దీక్షలు శుక్రవారం రాత్రి విరమించారు. ఎంఎల్‌సి షేక్ సాబ్జీ దీక్షలో కూర్చున్నవారికి నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. దీక్షదారులకు షుగర్ లెవెల్స్ తగ్గుతున్నప్పటికీ, రక్తపోటులో తేడా వస్తున్నప్పటికీ దీక్షను కొనసాగించారు. ఈ క్రమంలో పోలీసులు దీక్షను భగ్నం చేసేందుకు ప్రయత్నించారు. అనంతరం రాత్రి సమయంలో దీక్షను విరమిస్తున్నట్లు ఆందోళనకారులు ప్రకటించారు. ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యమైన పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, సిపిఎస్, జిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ దీక్షకు ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఎస్.ఎస్.రమేష్, జిల్లా నాయకులు అన్నెపు దేవేంద్ర, ధనుంజయ్, సుధాకర్ సంఘీభావం తెలిపారు. ఎపి గ్రంథాలయాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.రాంబాబు, ఇతర నాయకులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, సిఐటియు నాయకులు కిషోర్, ఐలు నాయకులు కట్ల సత్యనారాయణ సందర్శించి మద్దతు తెలిపారు. అలాగే అనేకమంది ఉపాధ్యాయులు శిబిరాన్ని సందర్శించారు. జిల్లాలోని జంగారెడ్డిగూడెం, నూజివీడు డివిజన్ కేంద్రాల్లో దీక్షలను కూడా విరమించారు.

ఎండిన వరి దుబ్బులతో నిరసన తెలుపుతున్న నాయకులు, రైతులు

ఎండిన వరి దుబ్బులతో నిరసన

వర్షాభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోండి

చింతలపూడిని కరువు మండలంగా ప్రకటించాలి

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - చింతలపూడి

వర్షాభావం వల్ల పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, చింతలపూడి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని సమ్మెటవారిగూడెం, పోతునూరు, మల్లాయగూడెం గ్రామాల్లో ఎపి రైతుసంఘం నాయకులు పర్యటించి ఎండిపోయిన వరి పంటను పరిశీలించారు. ఎండిన వరి దుబ్బులతో రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.30 వేలు ఇచ్చి ఆదుకోవాలంటూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ వర్షాభావంతో చెరువులు నిండక ఏర్పడిన కరువుతో పంటలకు సాగునీరందక చింతలపూడి మండలంలో వేలాది ఎకరాల్లో వరిపంట ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి సాగు చేసిన పంట ఎండిపోవడంతో రైతులు కన్నీరుపెడుతున్నారని తెలిపారు. కరువు పరిస్థితుల పరిశీలనకు అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గానీ రాకపోవడం అన్యాయమని విమర్శించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తిచేసి ఉంటే రైతులకు ఈ దుస్థితి వచ్చేది కాదన్నారు. ఎకరాకు రూ.25 వేల వరకూ వరి పంట సాగుకు రైతులు పెట్టుబడి పెట్టారని చెప్పారు. వరిసాగులో అత్యధిక మంది కౌలు రైతులేనన్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టాలను నమోదు చేసి ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారమందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సిఐటియు మండల కార్యదర్శి ఆర్‌వివిఎస్.నారాయణ మాట్లాడుతూ రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయి ఆందోళన చెందుతుంటే ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మద్దుకూరి తాతబ్బాయి, సత్యనారాయణ, సయ్యద్ హుస్సేన్, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

19 గ్రామాల్లో ఆరోగ్య సురక్ష శిబిరాలు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్షలో శుక్రవారం 19 గ్రామాల్లో నిర్వహించిన వైద్యశిబిరాల్లో 9,492 ఓపి నమోదైందని డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ట తెలిపారు. వీరిలో మహిళలు 5185 మంది కాగా పురుషులు 4307 మంది ఉన్నారు. ఆరోగ్య పరీక్షల అనంతరం 192 మందికి మెరుగైన వైద్యం కోసం ఆయా ఆసుపత్రులకు రిఫర్ చేశామన్నారు. వివిధ అనారోగ్య సమస్యలున్న 9492 మందికి ఉచితంగా మందులు అందించామన్నారు. కంటి వెలుగు శిబిరంలో 1,474 ఓపి నమోదైందన్నారు.

నేడు ఎంప్లాయి గ్రీవెన్స్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని ఉద్యోగుల నుండి ఫిర్యాదులు స్వీకరణకు ఈనెల 21న ఏలూరులోని కలెక్టరేట్ కార్యాలయంలో ఎంప్లాయి గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుండి ప్రారంభమవుతుందని, అధికారులు తమ సమస్యలపై వినతులను అందించవచ్చన్నారు. వినతిని అందించేవారు తమ సిఎఫ్ఎంఎస్ ఐడి, ఎంప్లాయి గుర్తింపు నెంబరు, ఆధార్ కార్డుతో గ్రీవెన్స్‌కు హాజరు కావాలని సూచించారు.

పోలీసుల అదుపులో నిందితుడు,(మృతిచెందిన శ్రీనివాసరావు)

చొప్పరమెట్లలో దారుణం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండలంలోని చొప్పరమెట్లలో దారుణం జరిగింది. వివాహేతర సంబంధం వద్దని వారించిన కన్నతండ్రిని కొడుకు దారుణంగా హత్యచేశాడు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐ ఎన్.చంటిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చొప్పరమెట్ల గ్రామానికి చెందిన కేదాసి శ్రీనివాసరావు(47)కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది. కుమారుడు నాగతేజ(24)కు ఇంకా వివాహం కాలేదు. అయితే నాగతేజ అదే గ్రామానికి చెందిన వివాహితురాలితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తండ్రికి తెలియడంతో పలుమార్లు నాగతేజను హెచ్చరించాడు. తన పద్ధతి మార్చుకోవాలని పదేపదే చెప్పేవాడు. ఈ క్రమంలోనే గురువారం రాత్రి ఇదే విషయమై తండ్రీకొడుకుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో నాగతేజ ఇటుకరాయితో తండ్రి తలపై బలంగా కొట్టాడు. దీంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. అయితే పారిపోయేందుకు ప్రయత్నించిన నాగతేజను నూజివీడు రూరల్ సిఐ పి.బాల సురేష్‌బాబు, ఆగిరిపల్లి ఎస్ఐ చంటిబాబు చాకచక్యంగా అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

రాస్తారోకో చేస్తున్న చేస్తున్న బాధితులు, గ్రామస్తులు

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా

జీలుగుమిల్లి: అటవీ శాఖ పనికి వెళ్లిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంపై కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం జాతీయ రహదారిపై ఆందోళన చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రమణక్కపేట గ్రామానికి చెందిన పండు భీముడు(42) గురువారం అటవి శాఖలో పనికి వెళ్లాడు. అక్కడ నీరసంగా ఉందని కళ్లు తిరిగి పడిపోయాడు. వెంటనే స్థానికులు, ఫారెస్ట్ సిబ్బంది హుటాహుటిన జీలుగుమిల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు భీముడు కుటుంబానికి న్యాయం చేయాలని జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. సుమారు గంటపాటు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీవాణి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ఉన్నతాధికారులతో మాట్లాడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని చెప్పి ఆందోళనకారులను శాంతింపజేశారు. రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు.

ప్రజాసమస్యలు పట్టని ఏలూరు కౌన్సిల్ సమావేశం : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో ప్రజాసమస్యలపై కనీస చర్చ జరగలేదని సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ విమర్శించారు. శుక్రవారం సిపిఎం నగర కమిటీ సమావేశం స్థానిక సిపిఎం కార్యాలయంలో బి.సోమయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కిషోర్ మాట్లాడుతూ ఏలూరు మున్సిపల్ కౌన్సిల్‌లో ప్రజాసమస్యలపై చర్చ కంటే నగరంలో స్థలాల పంపిణీ ఎజెండాగా సమావేశం జరగడం సిగ్గుచేటన్నారు. టిడిపికి చెందిన ప్రతిపక్ష సభ్యులు అభ్యంతరాలు తెలిపినప్పటికీ అధికార వైసిపి పట్టించుకోకపోవడం అన్యాయన్నారు. ఏడాది తరువాత జరిగిన ఈ సర్వసభ్య సమావేశంలో కనీసం ప్రజల సమస్యలపై చర్చించకపోవడం సిగ్గుచేటన్నారు. అధికార పార్టీ సభ్యులు దాదాపు సగం మంది సర్వ సభ్య సమావేశానికి రాకపోవడమే ప్రజాసమస్యలపై వైసిపికి ఉన్న చిత్తశుద్ధి అర్ధమవుతుందన్నారు. ఏలూరులో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఏలూరు శివారు ప్రాంతాల్లో ఉన్న ఇందిరమ్మ కాలనీలు, నగరంలో ఉన్న మురికివాడల్లో రోడ్లు, డ్రెయిన్లు, పారిశుధ్యం, దోమలు, పందులబెడద, విద్య, వైద్య సేవలు, ఇళ్ల పట్టాలు తదితర సమస్యలతో ప్రజలు బాధపడుతున్నారని కిషోర్ తెలిపారు. గత మున్సిపల్ ఎన్నికలకు ముందు వెంకటాపురం పంచాయతీ ప్రజలకు గోదావరి జలాలు పంపిణీ చేస్తామని, హామీ ఇచ్చారు కానీ నేడు దాని ఊసెత్తడం లేదన్నారు. కృష్ణ కెనాల్ పొడవునా అన్నీ వ్యర్థాలే ఉంటున్నాయని, వాటిని అరికట్టడం లేదని, ఆ నీటినే పంపుల చెరువుకు అందిస్తున్నారని తెలిపారు.

లోబ్రిడ్జిలో నిరంతరాయంగా లీకేజీ అయ్యి నీరు వస్తుందని, వాహనదారులు, పాదచారులు ఆ నీటిలో జారిపడి గాయాలపాలవుతున్నారని, కార్పొరేషన్ పాలక వర్గం కనీసం నీటి లీకేజీని అరికట్టలేకపోయారని విమర్శించారు. ప్రజల వద్ద డబ్బు వసూలు చేసి కట్టిన టిడ్కో ఇళ్ల రాష్ట్రంలో అనేక పట్టణాల్లో ఇస్తున్నారని, ఏలూరులో మాత్రం పంపిణీ చేయడం లేదని విమర్శించారు. జగన్న కాలనీల్లో కనీస సౌకర్యాలు లేవని తెలిపారు. ప్రస్తుత ఎంఎల్‌ఎ ఇంటి రహదారి అయిన శనివారపుపేట కాజ్‌వేపై వంతెన నిర్మాణం చేయలేకపోతున్నారని విమర్శించారు. సుబ్బమ్మ దేవి హైస్కూల్ గ్రౌండ్‌ను స్కూలుకు స్వాధీనం చేయాలని కిషోర్ డిమాండ్ చేశారు. ఇలా నగరంలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటుంటే అవేవీ చర్చించకుండా ఏడాది తరువాత సమావేశమైన కౌన్సిల్‌లో మొత్తం ఎజెండా మొత్తం స్థలాల పంపిణీకి, మేయర్ భర్త వేస్తున్న లే అవుట్‌లలో సౌకర్యాలు కల్పించడం కోసం తీర్మానాలు చేయడం ప్రజల ఆదాయాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుందని విమర్శించారు. వైసిపి పాలకవర్గం నగరంలో ప్రజల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు వి.సాయిబాబు, బి.జగన్నాధరావు, కె.రామాంజనేయులు, జి.రవికిషోర్, ప్రసాద్, కనకారావు, హైమ పాల్గొన్నారు.

శిశుగృహ నూతన భవనం ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశుగృహానికి స్థానిక విద్యానగర్‌లో నూతనంగా నిర్మించిన భవనాన్ని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సతీమణి డాక్టర్ మానస, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కె.పద్మావతి, సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.కేదారేశ్వరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేష్, డిసిపిఒ డాక్టర్ సిహెచ్.సూర్యచక్రవేణి, బాలల రక్షణాధికారి ఆర్.రాజేష్, సోషల్ వర్కర్ శ్రీకాంత్, మమతశ్రీ, కౌన్సిలర్ బాలస్వామి, అవుట్ రీచ్ వర్కర్ భార్గవి చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ రాజు, చైల్డ్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్ది ఆలయంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పద్మశ్రీ

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయాన్ని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పద్మశ్రీ సందర్శించారు. శుక్రవారం ఆలయానికి వచ్చిన పద్మశ్రీకి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.కొండలరావు స్వాగతం పలికి నూతన వస్త్రాలు ఆంజనేయ స్వామి చిత్రపటంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు బాబ్జీ, గురవాయిగూడెం సర్పంచి సత్యవేణి, ఎంపిటిసి రమారెడ్డి పాల్గొన్నారు.

న్యాయమే గెలిచింది

ఆక్వా ఫుడ్ పార్క్ వ్యతిరేక ఉద్యమ నేతలపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

గోదావరి మెగా ఆక్వా ఫుడ్ పార్క్ వ్యతిరేక ఉద్యమ నేతలపై 2016లో మోపిన హత్యాయత్నం కేసులను కోర్టు కొట్టివేసింది. ఈ కేసులో అప్పట్లో ఆరేటి వాసు, ముచ్చర్ల త్రిమూర్తులు తదితరులు 53 రోజులు జైల్లో కూడా ఉన్నారు. ఈ కేసుపై వాదోపవాదాల అనంతరం శుక్రవారం అసిస్టెంట్ సెషన్ జడ్జి తీర్పునిచ్చారు. కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు ఆరేటి వాసు, ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ ఫ్యాక్టరీ యాజమాన్యం తమ గ్రామస్తులపై అక్రమంగా పలు కేసులు పెట్టిందని, ఈ కేసులో కూడా సాక్షులను బెదిరించి, డబ్బు ఆశ చూపి తప్పుడు సాక్ష్యాలు చెప్పించారని, తమకు శిక్ష పడేలా చేసేందుకు శతావిధాలుగా ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. అయితే చివరికి న్యాయమే గెలిచిందని అన్నారు. తమ గ్రామాల కోసం పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. ఇదేవిధంగా మిగిలిన కేసులు కూడా నిలబడవని అభిప్రాయపడ్డారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని వాదించిన లాయర్ పూరిళ్ల శ్రీనివాస్‌ను తుందుర్రు, జొన్నలగరువు, కె.బేతపూడి గ్రామాల పెద్దలు, ప్రజలు, పోరాట కమిటీ నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. వైసిపి ప్రభుత్వం ఇప్పటికైనా మిగిలిన కేసులు ఎత్తివేయాలని, సిఎం జగన్ నాడు ప్రతిపక్ష నేతగా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న నేతలు

నిరసన తెలుపుతున్న నాయకులు

పాలస్తీనాపై దాడులకు నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పాలస్తీనాపై సైనిక దాడులను నిరసిస్తూ వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం నిరసన తెలిపారు. సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి కాటం నాగ భూషణం, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు మాట్లాడారు. మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్‌కి వత్తాసు పలుకుతుందని విమర్శించారు. ప్రపంచ శాంతిని నెలకొల్పాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రిఫార్మ్డ్ పార్టీ అధ్యక్షులు షేక్ హుస్సేన్, ఇఫ్టు నగర కార్యదర్శి బద్ద వెంకట్రావు, ఎస్‌సి, ఎస్‌టి మోనటరింగ్ సెల్ కమిటీ సభ్యులు మెతర అజయ్‌బాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు లెనిన్, ఠాగూర్, పిడిఎస్‌యు నాయకులు క్రాంతి పాల్గొన్నారు.

విఆర్ఒల సమస్యలపై సిసిఎల్ఎ సెక్రెటరీతో చర్చలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విఆర్ఒల సమస్యలపై శుక్రవారం విజయవాడ మంగళగిరిలోని సిసిఎల్ఎ కార్యాలయంలో సిసిఎల్ఎ సెక్రెటరీ ఇంతియాజ్‌ను రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నేతలు కలిసి చర్చించినట్లు రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతి రాజు రవీంద్ర రాజు తెలిపారు. ఈ మేరకు ఏలూరులో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 166 జిఒ ఇచ్చి ఆరు నెలలైనా ఇప్పటి వరకూ ఏ జిల్లాలో కూడా అమలు చేయలేదని, వెంటనే గ్రేడ్-2, విఆర్ఒలకు గ్రేడ్-1 ప్రమోషన్లు ఇచ్చేలా అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలివ్వాలని కోరారు. అలాగే సిసిఎల్ఎలో పెండింగ్‌లో ఉన్న విఆర్ఒ సీనియర్ అసిస్టెంట్ ప్రమోషన్ల రేషియో, వన్ టైం సెటిల్మెంట్ ఫైల్ వెంటనే ప్రభుత్వానికి నివేదిక పంపాలని విజ్ఞప్తి చేసి విఆర్ఒల ఇతర సమస్యలు కూడా పరిష్కరించాలని కోరినట్లు ఆయన తెలిపారు.

జెడ్‌పి సిఇఒ బదిలీ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జిల్లా పరిషత్ సిఇఒ రవికుమార్‌ను బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రవికుమార్ సొంత శాఖలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. పెదపాడు ఎంపిడిఓ ఎస్.నిర్మలజ్యోతికి డిఎల్‌డిఒగా ఉద్యోగోన్నతి కల్పించి జెడ్‌పి డిప్యూటీ సిఇఒగా నియమిస్తూ సిఇఒ బాధ్యతలు అప్పగించారు.

పేదల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - ముదినేపల్లి

పేదల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ లక్ష్యమని జెడ్‌పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ అన్నారు. మండలంలోని వడాలి సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జెడ్‌పిటిసి వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షతో పేద ప్రజల చెంతకు కార్పొరేట్ వైద్య సేవలు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం ఎంపిడిఒ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మరీదు దుర్గాశ్రీ, ఎంపిటిసి పల్లి శ్రీదేవి, మరీదు నాగయ్య, వైసిపి సీనియర్ నేత ఈడే వెంకటేశ్వరరావు, మరీదు హనుమంతు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో స్వల్పకాలిక అనారోగ్యమే కాకుండా దీర్ఘకాలిక వైద్య సేవలు కూడా అందించడం జరుగుతుందని జెడ్‌పిటిసి డాక్టర్ ప్రశాంత్, సర్పంచి కోండేటి విజయలక్ష్మిలు తెలిపారు. శుక్రవారం మండలకేంద్రమైన ముసునూరులో ఎంపిపి పాఠశాల నందు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్లగుంట సొసైటీ అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల వారికి అందుబాటులో వుండేవిధంగా ఈ జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించడం అందరికి ఆరోగ్యమే మహాభాగ్యం లాంటిదన్నారు. అదేవిధంగా నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ ముసునూరులో జగనన్న సురక్ష స్టాల్స్‌ను పరిశీలించి, వైద్యులు యం.కిరణ్‌కుమార్, డాక్టర్ కిరమ్యా, జి.ప్రకాష్‌లతో మాట్లాడి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బిలీ లక్ష్మి, ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, తహశీల్దార్ దాసరి సుధ, పంచాయతీ కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, మువ్వ స్రవంతి పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : జగనన్న సురక్ష కార్యక్రమంలో 458 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని మున్సిపల్ కమిషనర్ కె.భవానీ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక త్రివేణి కళాశాల ప్రాంగణంలో ఒకటవ సచివాలయ పరిధిలో నివాసులకు జగనన్న సురక్ష కార్యక్రమం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు చిటికెన అచ్యుతరామయ్య, మేడవరపు విద్యాసాగర్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో దసరా విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - పెదపాడు

దసరా సెలవులలో భాగంగా పెదపాడు గ్రంథాలయంలో దసరా విజ్ఞాన శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో ఉదయం 8 గంటల నుంచి విద్యార్థులకు నీతి కథలు చెప్పించడం, చదివించడం, పుస్తక పఠనం చేయించడం చేశారు. విద్యార్థులకు చెస్, క్యారమ్స్ ఆటలు ఆడించి, ఆటల్లోని మెలుకువలు నేర్పించి పోటీలు నిర్వహించారు. విరామ సమయంలో విద్యార్థులకు స్నాక్స్ అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆటో, మోటార్ వాహన డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటియుసి అనుబంధ ఆటో డ్రైవర్స్, వర్కర్స్ ఫెడరేషన్ ఏలూరు నగర అధ్యక్షులు పుప్పాల కన్నబాబు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఆటో, మోటార్ వాహనాలపై పెనాల్టీలు పెంచుతూ విడుదల చేసిన జీఓ నెంబర్ 21, 31 రద్దు చేయాలని ఆయన కోరారు. స్థానిక త్రి చక్ర ఆటో స్టాండ్ వద్ద యూనియన్ అధ్యక్షులు కోలా రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కన్నబాబు మాట్లాడుతూ వాహనదారులపై ఉన్న పాత పోలీసు ఈ చలానాలు రద్దుచేసి, డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని, భారీగా పెంచిన డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బెల్లంకొండ సురేష్ పాల్గొన్నారు.

రూ.4 లక్షలతో వాటర్ ట్యాంక్ ఏర్పాటు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో గోద్రేజ్ పామాయిల్ ఫ్యాక్టరీ సహకారంతో రూ.4 లక్షల విలువైన వాటర్ ట్యాంకును సీతానగరం, చింతంపల్లి పంచాయతీలకు అందజేశారు. ఈ సందర్భంగా చింతంపల్లి సర్పంచి దండ్రె రామకృష్ణ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకి తాగునీటి సమస్య లేకుండా చేయడమే లక్ష్యమని తెలిపారు. తాగునీటి సమస్య గ్రామాల్లో ప్రజలకు రాకూడదని, గోద్రేజ్ పామాయిల్ ఫ్యాక్టరీ సహకారంతో మంచినీటి వాటర్ ట్యాంక్ ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

ప్రజాశక్తి - చింతలపూడి

అధిక ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. పట్టణంలో సిపిఐ మండల జనరల్ బాడీ సమావేశం పుల్లూరి సోమశేఖర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ 2014 నుండి మేము అధికారంలోకి వస్తే, ధరలు తగ్గిస్తానని, నల్లధనం వెలికి తీసి ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల ఇస్తానని వాగ్దానం చేసిన నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్యాస్ ధర రూ.1,200 పెంచి, ఐదు రాష్ట్రాల ఎన్నికల వచ్చేసరికి 200 తగ్గించడని తెలిపారు. పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశానంటుతున్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, మండల సహాయ కార్యదర్శి తోట్టపాటి బాబు, మండల కమిటీ సభ్యులు బోడ పజ్జం, జంగా మండచంద్ర రెడ్డి, దంతా కృష్ణ, ఎస్‌కె.జానీ, ఎస్‌కె.కాలేషా, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి తోట్టపాటి రాజు పాల్గొన్నారు.

మహా పాదయాత్రను విజయవంతం చేయాలి : వైసిపి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఈనెల 22న చేపట్టిన మహా పాదయాత్రను విజయవంతం చేయాలని వైసిపి మండల కన్వీనర్ ఎన్‌ఎమ్‌బికెచ్ శ్రీను రాజు, వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షులు వాసిరెడ్డి మధులు పిలుపునిచ్చారు. మండలకేంద్రమైన టి.నరసాపురంలోని వైసిపి మండల నాయకులు దేవరపల్లి ముత్యాల ఇంటి వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు, జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజుల ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ ఆదివారం కోటగిరి శ్రీధర్ 50వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కామవరపుకోట వీరభద్రస్వామి ఆలయం నుండి ద్వారకా తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు మహా పాదయాత్ర నిర్వహిస్తున్నారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి.లక్ష్మి వెంకటేశ్వరరావు, బండి సుబ్బారావు, తుమ్మూరి శ్రీనివాస రెడ్డి, వంటిపల్లి సుబ్రహ్మణ్యం, కన్నం సర్వేశ్వర రావు, బొద్దు శ్రీను పాల్గొన్నారు.

గ్రామ కమిటీల నియామకంపై చర్చ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

వైసిపి మండల, గ్రామ కమిటీల నియామకంపై జాలిపూడి గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఏలూరు రూరల్ మండల అధ్యక్షులు తేరా ఆనంద్ ఆధ్వర్యంలో శుక్రవారం చర్చించారు. సీనియర్ నాయకులు పివి రావు, ఎంపిపి పెన్మెట్స శ్రీనివాసరాజు, జాలిపూడి బ్యాంక్ అధ్యక్షులు బొల్లుముంత రాము, మాదేపల్లి ఎంపిటిసి నరహరిశెట్టి రాజాకృష్ణ, మాదేపల్లి సర్పంచి కొంపాటి ప్రభుదేవ్, జాలిపూడి గ్రామ సర్పంచి నవ్వ పార్టీ సభ్యులు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాల పరిశీలన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మండలంలోని వరి పొలాలను పరిశీలించామని మండల వ్యవసాయ శాఖ అధికారి కెవిఎన్ పోసారావు తెలిపారు. శ్రీనివాసపురం మండలంలోని మైసన్నగూడెం రైతు భరోసా కేంద్రం పరిధిలో గ్రామ ప్రతినిధులు, రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు దృష్ట్యా రైతులందరూ నిరంతరం 9 గంటల విద్యుత్ అందించాలని కోరుతున్నారని తెలిపారు. అలాగే రాబోయే ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు రైతులందరూ ముందస్తుగా గోనె సంచులు, రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సహాయ మండలి ఛైర్మన్ సత్యం ప్రసాద్, మండల ఉద్యానవన అధికారి దీరజ్, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ విభాగం కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ విభాగం కోసం సెల్: 83339 88814

యువత దేశభక్తిని అలవర్చుకోవాలి

నా మట్టి - నా దేశం కార్యక్రమంలో భాగంగా అమృత కలశాలతో ర్యాలీ

ప్రజాశక్తి - టి.నరసాపురం

యువత దేశభక్తిని అలవర్చుకోవాలని మండల విద్యాశాఖాధికారిణి ఎస్.కళ్యాణి తెలిపారు. శుక్రవారం నా భూమి - నా దేశం అమృత కలశ యాత్రలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు జాతీయ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతలో దేశ భక్తి నింపడానికే అమృత కలశ యాత్ర నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల నుంచి సేకరించిన మట్టిని కలశంలో నింపి ఢిల్లీకి పంపనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు, మండల నాయకుడు బొండాడ వెంకన్నబాబు పాల్గొన్నారు.

టి.నరసాపురంలోని ర్యాలీలో పాల్గొన్న ఎండిఒ కళ్యాణి

ద్వారకాతిరుమలలో..

ముసునూరు : నా దేశం - నా మట్టి కార్యక్రమంలో భాగంగా జాతీయ స్థాయిలో ఢిల్లీకి పంపించే మట్టి కలశాలను ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ దాసరి సుధ, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, మువ్వ స్రవంతి, ఎపిఒఎల్ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కెవి.గంగరాజు, సీనియర్ అసిస్టెంట్ ఎ.సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ పి.శేఖర్ బాబు, జి.లక్ష్మినారాయణ పాల్గొన్నారు. సూపరింటెండెంట్ కూచిపూడి సాయిరామ్, సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, జూనియర్ సన్నీరాజన్ పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పౌరులను గౌరవించుకోవడానికి మండలంలోని ఎంపిడిఒ కార్యాలయం నందు 'మేరా మట్టి మేరా దేశ్'

ఉంగుటూరు : ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా భారత ప్రభుత్వం తలపెట్టిన మేరా మట్టి - మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉంగుటూరులో కలశాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మండల పరిషత్ కార్యాలయం నుంచి సచివాలయం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయిలో సేకరించిన ఈ కలశాల మట్టిని జిల్లా స్థాయికి అందజేయడం జరుగుతుందని ఎంపిడిఒ ప్రేమాన్విత తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు గంటా శ్రీలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, ఉపాధ్యాయులు సిరిమామిళ్ల పెద్దిరాజు, ఎం.చక్రవర్తి, కె.హరికృష్ణ, సిఆర్‌పిలు నారాయణ పాల్గొన్నారు.

ఉంగుటూరులో..

పలు గ్రామాల్లో 'ఫ్రైడే డ్రైడే'

చాట్రాయి : మండలంలోని చాట్రాయి, బూరుగు గూడెం, చనుబండ, పర్వతాపురం, జనార్ధన వరం, చిత్తపూరు గ్రామాలలో చాట్రాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామాలలో దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి ఎఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాలలో ప్రధాన రహదారి, అంతర్గత రోడ్లలో పెద్ద పెద్ద గోతులు పడి మురికి నీరు నిల్వ ఉండి, దోమలు చేరి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. విష జ్వరాలతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామాల్లోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలో డ్రయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వ్యర్థ నీరు నిల్వ ఉండి ప్రజలు వ్యాధులకు గురవుతున్నారని, అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

PASSPOST LOST

I, **V.Balasubrahmanyam D,** have lost My Passport No. **H9251087** given by VSKP Passport office having validity from 28th July 10 to 27th July20. I Lost it on the way from Tadepalligudem Highway by-pass to Tadepalligudem bustand area on 16th the month. If its found, I request you to call me at **98480 66603.**

జనరల్ ప్రకటన

మహారాజశ్రీ 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, భీమవరం
పశ్చిమ గోదావరి జిల్లా
G.W.O.P.No. 24/2023

పిటీషనరు: పోశింశెట్టి రామకృష్ణ
Vs
రెస్పాండెంట్లు: నిల్

పై GWOP పిటీషనరు అయిన పోశింశెట్టి రామకృష్ణ తనను మాస్టర్ పోశినశెట్టి @ పోశింశెట్టి వంశీకృష్ణ మరియు కుమారి పోశినశెట్టి @ పోశింశెట్టి నాగ మౌనిక యొక్క సంరక్షణా బాధ్యతలు చూసుకొనుటకు గాను లీగల్ గార్డియన్‌గా అపాయింట్ చేయమని దాఖలు చేసియున్నారు. సదరు పై నెంబరు GWOP ది. **09-11-2023వ సంవత్సరం తేదీకి శ్రీ కోర్టు వారు వాయిదా వేసి ఉన్నారు.** సదరు పై నెంబరు GWOP లో ఎవ్వరికైనా అభ్యంతరములు ఉన్నట్లైతే వ్రాత పూర్వకంగా గాని, లాయరు గారి ద్వారా గాని సదరు తేదీన తెలుపుకోవచ్చు. లేని ఎడల చట్ట ప్రకారం సదరు పై నెంబరు GWOP నిర్ణయించబడును.

నెల్లి సతీష్ కుమార్
అడ్వకేట్, ఆకివీడు.
ఆకివీడు,
18-10-23. సెల్: 98482 21349

రాజకీయ కక్షతోనే చంద్రబాబు అరెస్టు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారంలో టిడిపి నేతలు

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండిస్తూ మండలంలోని రెడ్డి గణపవరం పంచాయతీలో నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో డోర్ టూ డోర్ తిరుగుతూ చంద్రబాబుని ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయ కక్షతోనే అరెస్టు చేశారని ఆరోపించారు. జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న అరాచక పాలనను వివరిస్తూ, బాబుతో నేను అనే కార్యక్రమాన్ని ప్రజలకు వివరించారు. చంద్రబాబుకి మద్దతుగా మేమున్నాం అంటూ 9261292612 నెంబర్‌కు మిస్ కాల్ ఇప్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు చిలకమూడి సుధాకర్, నియోజవర్గ ఎస్‌టి సెల్ అధ్యక్షులు మడకం రామకృష్ణ, మండల ఎస్‌సి సెల్ మాజీ అధ్యక్షులు బొబ్బర ఎలీషా, బూత్ ఇన్‌ఛార్జి గన్నిన సూర్యచంద్రం, కోర్స దుర్గారావు, బడిశా ముత్యాలరావు, బొబ్బర సందీప్, సర్వారాయుడు బాలు పాల్గొన్నారు.

బుట్టాయగూడెంలోని బాబుతో నేను కార్యక్రమంలో బొరగం శ్రీనివాసులు

చింతలపూడి : చంద్రబాబుని అరెస్ట్ చేయడం ముమ్మాటికి వైసిపి ప్రభుత్వ కక్షపూరిత చర్యేనని, టిడిపి పట్టణ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరావు, జనసేన మండల అధ్యక్షులు చిదరాల మధుబాబు తెలిపారు. టిడిపి ఆధ్వర్యంలో చార్లెస్ నగర్‌లో బాబుతో నేను కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం మాట్లాడారు. అనంతరం టిడిపి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి తూము విజయ్ మాట్లాడుతూ 2024లో టిడిపి, జనసేన కూటమి విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నలమాటి శ్రీను, సొంగా ఏసుపాదం, నియోజకవర్గ నాయకులు డా.మారుమూడి థామస్, నలమాటి రామకృష్ణ, వాసు, జనసేన సైనికులు గుమ్మిశెట్టి భారతి, సునీత, శ్రీను, కుమార్ పాల్గొన్నారు.

ఆటోనగర్ ఎన్నికల్లో కర్రి ప్యానల్ విజయ ఢంకా

ఏలూరు టౌన్ : ఏలూరు ఆటోనగర్ మెకానిక్స్ అసోసియేషన్ ఎన్నికల్లో కర్రి నాగేశ్వరావు ప్యానల్ విజయదుందుభి మోగించింది. శుక్రవారం ఏలూరు గన్ బజార్లో అధ్యక్ష, ఉపాధ్యక్షులకు ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 312 అభ్యర్థులు ఓటర్లుగా ఉండగా, 214 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీటిలో కర్రి నాగేశ్వరావుకి 195 ఓట్లు పోలవ్వగా, సమీప అభ్యర్థి, మాజీ అధ్యక్షులు మాగంటి నాగభూషణం వర్గానికి చెందిన బేతపూడి కిరణ్ కుమార్‌కి 16 ఓట్లు పోలయ్యాయి. నాగేశ్వరరావుకి 179 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఉపాధ్యక్షుడిగా పోటీ చేసిన కర్రి ఈశ్వరరావుకి 190 ఓట్లు రాగా, సమీప అభ్యర్థి పుప్పాల ముకుంద రావుపై 180 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఇప్పటికే కార్యదర్శిగా అడపా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మద్రపు సత్యనారాయణలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు శుక్రవారం ఏలూరు గన్ బజార్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నికల కమిటీ సభ్యులు కర్రి మహేశ్వరరావు, మల్లవరపు రంగారావులు ప్రకటించారు. ఎన్నికల్లో విజయం సాధించిన కర్రి నాగేశ్వరావు, కర్రి ఈశ్వరరావులను ఆటోనగర్ సభ్యులు పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. కొత్తగా ఏర్పడిన పాలకవర్గం ఆటో నగర్‌ను అన్నివిధాల అభివృద్ధి చేయాలని సభ్యులు కోరారు. నిజాయితీగా సేవలు అందించి, ఆటోనగర్ అభివృద్ధికి కృషి చేస్తానని కర్రి నాగేశ్వరావు మీడియాతో తెలిపారు. వైసిపి నాయకులు పొలిమేర హరికృష్ణ, జిఎంఆర్, పలువురు సంఘ నాయకులు నూతన పాలకవర్గానికి అభినందనలు తెలిపారు.

ఎంపీ సమక్షంలో చర్చలు : ఎన్నికల్లో అధ్యక్షులుగా పోటీ చేసిన కర్రి నాగేశ్వరరావు ప్యానల్, మాజీ అధ్యక్షులు మాగంటి నాగభూషణం ప్యానల్ శుక్రవారం ఉదయం ఎంపీ కోటగిరి శ్రీధర్ క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిశారు. ఎన్నికల నిర్వహణపై చర్చించినట్లు సమాచారం. ఎన్నికలు సజావుగా జరగడానికి సహకరించాలని ఇరువురుని ఎంపీ కోరినట్లు సమాచారం. ఆయన సూచన మేరకు మధ్యాహ్నం 12 గంటలకు ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల కేంద్రమ్ వద్ద రెండో పట్టణ పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

'నాపై అసత్య ఆరోపణలు తగవు'

ఏలూరు టౌన్ : మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్, టిడిపి అనుబంధ మీడియా సంస్థలు వాలంటీర్ ద్వారా మోసపోయిన బాలిక విషయంలో తప్పుడు ప్రచారాలు చేస్తూ వైసిపి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేయడం తగదని దెందులూరు వైసిపి అధికార ప్రతినిధి, శ్రీరామవరం సర్పంచి కామిరెడ్డి నాని బాబు తెలిపారు. శుక్రవారం దెందులూరు పరిధిలో సోషల్ మీడియాలో చింతమనేని ప్రభాకర్, టిడిపి అనుబంధ ఎల్లో మీడియా చేస్తున్న అసత్య ప్రచారాలపై నాని విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ బాలిక కుటుంబ సభ్యులను బాధ పెట్టడం ఇష్టం లేక టిడిపి వారు ఎంత అసత్య ప్రచారాలు చేసినా తాను మాట్లాడకుండా ఉన్నానని, కానీ మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ బాధిత బాలిక కుటుంబ సభ్యులతో అబద్ధాలు చెప్పించడం చాలా దారుణమని అన్నారు. టిడిపి వారు సోషల్ మీడియాలో తన దగ్గరికి వస్తే రూ.10 వేలు బాధిత బాలిక గర్భిణీకి ఇప్పిస్తానంటూ చెప్పానని వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని, ఇలాంటి అసత్య ప్రచారాలు చింతమనేని మానుకోవాలని తెలిపారు. దమ్ము, ధైర్యం ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలి కానీ ఇలాంటి అసత్య ప్రచారాలు చేస్తున్నారని నాని విమర్శించారు. బాలికతో పాటు గ్రామ వాలంటీర్ కుటుంబ సభ్యులు వైసిపి, టిడిపిలకు చెందిన పెద్దల సమక్షంలో రాజీ చేసుకుని, వివాహం చేసుకుంటామని మాట్లాడుకున్న నేపథ్యంలో వాలంటీర్ పారిపోతే పోలీసులకు వైసిపికి చెందిన గ్రామ పెద్దలు మాత్రమే ఫిర్యాదు చేయడం ఏంటని ఆయన అన్నారు. బాధిత బాలిక కుటుంబానికి ప్రభుత్వం తరపున న్యాయం జరిగేలా పూర్తిస్థాయిలో సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఇప్పటికైనా మీడియా వారు సైతం పోలీస్ స్టేషన్‌లో బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించాలన్నారు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేసిన దాంట్లో ఎక్కడా కూడా నా గురించి ప్రస్తావించలేదన్నారు. దీనికి తోడు సంబంధం లేని ఇద్దరు వాలంటీర్ల పేరు కూడా ఈ బాలిక కేసులో పోలీసులు ఫిర్యాదు చేయడం చాలా బాధాకరమన్నారు. ఇకనైనా తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారాలు ఆపకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని నాని హెచ్చరించారు.

PUBLIC NOTICE

ITC Limited – Foods Division, Eluru

Invites parties for buying process waste & Scrap material from the Foods Plant. Interested Parties can send their quotations on or before 26-10-2023.

MAJOR ITEMS

1.Waste Fried Potato Chips, 2.CFC Waste, 3. Paper Core, 4. Waste Laminate shredded, 5. Waste Potato Wet Starch, 6. Waste Potato Plastic Bags, 7. Waste Seasoning Bags

Note: Detailed List of scrap items will be shared during the site visit.

- The quote to be send specified unit of Measurement of all items strictly in Kilograms
- Crushing, Shredding, Packing, Loading/Unloading &transportation shall be managed and borne by the buyer.
- The Buyer shall place and install necessary machinery/equipment in this regard at the unit.
- All applicable taxes shall be charged extra on the quoted rates and are to be borne by the buyer. All relevant statutory compliances shall be fulfilled and ensured by the buyer.
- If any clarification needed related to e-auction, EMD, Process and statutory requirements. Please contact: ITC Limited, Foods Division, C/o Riqo Foods Private Limited, Survey no.70/1A & 70/1B, Nayampalli Village, Pedavegi Mandal, Eluru District, Andhra Pradesh-534450. Contact Person Name: Mr. C Prema Kumar Reddy, Sr. Finance Executive, mail ID – c.reddy@itc.in
- Scrap can be inspected with prior intimation between 10 AM to 5 PM at factory location. The quotation shall be considered for a contract for a term up to one year.

Mr.C.PREMA KUMAR REDDY
Sr.Finance Executive

In the Court of the Hon'ble Principal Senior Civil Judge, Eluru
E.A. No. 1/23 in E.P. No. 16/23 in O.S. No. 90/2022

Between:
Sri Govindu Naga Raju ***...Petitioner/ D.Hr***
AND
Sri Padala Satyam ***...Respondent/ J.Dr***

Respondent/ J.Dr:
Padala Satyam, S/o. Sanyasi (late), Hindu, age 61 years, D.No. 20E-13-22, Pappala vari Street, Kothapeta, Eluru, Eluru Dist.,

పై E.P. వారెంటు గ్రంధములో J.Dr కు నోటీసు నిమిత్తం పై పిటిషన్‌ను ది. **31-10-2023 నకు వాయిదా వేసినారు.** సదరు పిటీషన్ విషయముపై J.Dr కు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల వాయిదా రోజు **ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల పరోక్షముగా విచారించి తీర్మానించెదరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

CH.VENKATA RAMANA RAO
V.V.SAI RAMA RAO
Eluru — Advocates, Eluru
Dt.18-10-23 — Cell: 8247742566

మళ్లీ జగనే సిఎం అవ్వాలి : ఎంఎల్‌ఎ

చింతలపూడి : ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే అధికారంలోకి రావాలని చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్‌ఎ ఉన్నమాట్ల ఎలిజా తెలిపారు. పట్టణంలో వికేఎం ఫంక్షన్ హాల్‌లో 'రాష్ట్రానికి జగన్ ఎందుకు' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 31 లక్షల మంది సొంతిల్లు సహకారం చేసిన ఘనత ముఖ్యమంత్రిదేనన్నారు. పేదరిక నిర్మూలనకు వైసిపి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కోప్పుల నాగు, మిర్యాల దిలీఫ్, సిటిమెడికల్ అధినేత, చింతంపల్లి సర్పంచి రామకృష్ణ పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగు నీరందించడమే ధ్యేయం

కలిదిండి : ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన తాగు నీరందించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు కైకలూరు నియోజకవర్గ ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని సంతోషపురంలో రూ.5 లక్షల నిధులతో నిర్మాణం పూర్తి చేసుకున్న మైక్రో ఫిల్టర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, సంతోషపురం, కలిదిండి, పడమటిపాలెం సర్పంచులు ద్రోణాద్రి నాగలక్ష్మి పాల్గొన్నారు.

HDFC BANK

హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్.

బ్రాంచి చిరునామా: 1వ అంతస్తు, శ్రీ హరీ టవర్స్, నెం.59ఏ-1-5/1, మేరీస్ స్టెల్లా కాలేజ్ ప్రక్కన, విజయవాడ-520008, ఫోన్: 0866-2429130.
రిజిస్టర్డు ఆఫీసు: హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ హౌస్, సేనపతి బపత్ మార్గ్, లోవర్ పెరల్ (పడమర), ముంబాయి-400013.
CIN: L65920MH1994PLC080618, Website: www.hdfcbank.com

స్థిరాస్తుల యొక్క వేలం కొరకు అమ్మకం ప్రకటన (కేవలం ఇ-బిడ్డింగ్ ద్వారా మాత్రమే అమ్మకం)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) నందలి నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం నోటీసు.
సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా కాలమ్ (ఎ)లో సూచించబడిన ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన / చార్జీచేయబడిన కాలమ్ (సి)లో వివరించబడిన దిగువనీయబడిన స్థిర ఆస్తి (ఆస్తులు) హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్ సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారిచే కాలమ్ (డి)లో తెలిపిన విధంగా సంబావిత / భౌతిక స్వాధీనత చేపట్టబడినవి. (పూర్వపు హెచ్.డి.ఎఫ్.సి లిమిటెడ్ ను హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్‌తో విలీనం చేయబడింది, గౌరవనీయమైన యన్.సి.ఎల్.టి-ముంబై 17 మార్చి 2023 నాటి ఆర్డర్ ద్వారా ఆమోదించబడిన సమ్మేళనం పథకం ద్వారా పరిమితం చేయబడింది). అవి దిగువ తెలిపిన వివరాల ప్రకారం **"ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలానే స్థితి లో"** (హెచ్.డి.ఎఫ్.సి) సెక్యూర్డ్ క్రెడిటార్ ద్వారా విక్రయించబడతాయి.
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) క్రింద కాలమ్ (ఎ) లో సూచించిన ఋణగ్రహీత(లు)/ తనఖాదారు(లు) / సంబంధిత ఋణగ్రహీత(లు) / తనఖా ఋణగ్రహీత(లు) (మరణించినందున) యొక్క చట్టబద్ధవారసులు, చట్టబద్ధ ప్రతినిధులు (తెల్సిన లేదా తెలియనివారైనా), ఎగ్జిక్యూటరు(లు), అడ్మినిస్ట్రేటరు(లు), ఉత్తరాధికారు(లు) మరియు అసైన్(ల)కు సందర్భాన్నిబట్టి ఇందుమూలముగా తెలియజేయడమైనది. అమ్మకం యొక్క వివరమైన నియమనిబంధనల కొరకు హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్ సెక్యూర్డ్ క్రెడిటార్ వెబ్‌సైట్ అనగా **www.hdfcbank.com** లో ఇవ్వబడిన లింక్‌ను చూడండి.

క్ర. సం.	(ఎ)	(బి)	(సి)	(డి)	(ఇ)	(ఎఫ్)	(జి)	(హెచ్)	(ఐ)
	ఋణగ్రహీత(ల)/తనఖా ఋణగ్రహీత(ల)/ గ్యారంటరు(ల)/సంబంధిత ఋణగ్రహీత(ల)/ తనఖా ఋణగ్రహీత(ల)/గ్యారంటరు(ల) (మరణించినందున) యొక్క చట్టబద్ధ వారసులు, చట్టబద్ధ ప్రతినిధులు (తెల్సిన లేదా తెలియనివారైనా), ఎగ్జిక్యూటరు(లు), అడ్మినిస్ట్రేటరు(లు), ఉత్తరాధికారు(లు) మరియు అసైన్(ల) పేర్లు సందర్భాన్ని బట్టి.	రాబట్టుకొవల్సిన బకాయిలు (హామీగల ఋణం) (రూ.)	స్థిరాస్తి వివరాలు/హామీగల ఆస్తి వివరము 1 చ.మీటర్ 10.76 చ.అ.లకు సమానం)	స్వాధీనత రకం	రిజర్వ్ ధర	ధరావతు (రూ.)	వేలం తేది మరియు సమయం	తనిఖీ తేది	బిడ్స్ దాఖలుకు చివరి తేది:
1	**శ్రీమతి పిండి సలోమీ (ఋణగ్రహీత), శ్రీ పిండి స్టిఫెన్ (సహ-ఋణగ్రహీత) & మెస్సర్స్ షైన్ క్యాస్టిల్ హోమ్ గెస్ట్ హౌస్ (సహ-ఋణగ్రహీత)**	ది. 31-డిసెంబర్-21* నాటికి బకాయి రూ.84,26,955/-	కృష్ణాజిల్లా, పటమట యస్.ఆర్.ఓ, విజయవాడ టౌన్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ లిమిట్స్, పటమట, సర్వే నెం.171/4, మున్సిపల్ వార్డు నెం.29, పాత అసెస్మెంట్ నెం.36075/1, క్రొత్త అసెస్మెంట్ నెం.596231, డోర్.నెం.56-15-41, మొత్తం 524 చ.గ.లు లేదా 438.132 చ.మీ.లలో 80 చ.గ.లు లేదా 66.890 చ.మీ.ల అవిభాజ్యపు స్థలంలో 100 చ.అ.ల పార్కింగ్ ఏరియా, 1850 చ.అ.ల (కామన్ ఏరియాతో గల ప్లింత్ ఏరియా)తో గల "సాయి మిత్ర రెసిడెన్సి" క్రింది అంతస్తులోని ఫ్లాట్ నెం.జి-1 ఈ దిగువ హద్దులలో మొత్తం భూమికి హద్దులు: **తూర్పు:** మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు, **దక్షిణం:** కటకం గురవయ్య గారి ఆస్థి, **పడమర:** శ్రీ విహార్ అపార్ట్‌మెంట్ వారి ఆస్థి, **ఉత్తరం:** గణపతి సచ్చిదానంద జ్ఞానబోధ సభా ట్రస్ట్ వారి ఆస్థి. సాయి మిత్ర రెసిడెన్సి, క్రింది అంతస్తు, ఫ్లాట్ నెం.జి-1కు హద్దులు: **తూర్పు:** మెట్లు మరియు ఉమ్మడి పార్కింగ్, **దక్షిణం:** కటకం గురవయ్య గారి ఆస్థి, **పడమర:** శ్రీ విహార్ అపార్ట్‌మెంట్ కాంపౌండ్ గోడ, **ఉత్తరం:** గణపతి సచ్చిదానంద జ్ఞానబోధ సభా ట్రస్ట్ వారి ఆస్థి. సంప్రదించవలసిన వ్యక్తి: భరత్ - మొబైల్ నెం. 9426794680.	భౌతికంగ	రూ. 80,00,000/- (ఎనభై లక్షల రూపాయలు మాత్రమే)	రూ. 8,00,000/- (ఎనిమిది లక్షల రూపాయలు మాత్రమే)	15-11-2023 నాటి ఉ 11.00 గం॥ల నుండి 12.00 గం॥ మధ్య (5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో అమ్మకం ముగిసే వరకు)	06-11-2023 ఉ॥ 11 గం॥ల నుండి సా॥ 4 గం॥ల మధ్య	14-11-2023 నాటి సాయంత్రం 05.15 లోగా

*చెల్లింపు మరియు / లేదా వసూలు తేది వరకు వర్తించు విధంగా సాలుకు 18% చొప్పున తదుపరి వడ్డీ, అయిన సంభవనీయ ఖర్చులు, వ్యయాలు, చార్జీలు వగైరా సహ.
HDFC యొక్క అధీకృత అధికారికి తెల్సినంత మరియు అతని వద్ద ఉన్న సమాచారం మేరకు పై స్థిరాస్తులు / హామీగల ఆస్తులకు సంబంధించి ఎట్టి ఎన్‌కంబ్రెన్సులు లేవు.

తేది : 21-10-2023
ప్రదేశము : విజయవాడ
సం/- అధీకృత అధికారి
హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్